క్లుప్తంగా

పూజా సామగ్రి వితరణ



వీపనగండ్ల: శివమాలధారుల విజ్ఞప్తి మేరకు మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకుడు, శివ భక్తుడు ముంత మల్లయ్యయాదవ్‌ లక్ష్మి దంపతులు శివపూజకు అవసరమైన టేకు చెక్కలతో తయారు చేసిన మెట్ల దిమ్మె, దీపపు చెమ్మలతో పాటు పూజకు అవసరమైన సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా శివ మాలధారులు మల్లయ్య దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏదుల ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓగా రాములు



గోపాల్‌పేట: ఏదుల మండల ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓగా రాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తకోటలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించానని, మండల అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



అమరచింత: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్‌ పోర్టర్‌ ద్వారా ఆచూకీ కనుక్కొని బాధితులకు బుధవారం అందించామని ఎస్‌ఐ సురేష్‌ తెలిపారు. పదిహేను రోజుల కిందట పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు తమ మొబైల్‌ ఫోన్లను పోగొట్టుకున్నామని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి మొబైళ్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

అదుపు తప్పి కంటైనర్‌ బోల్తా




కొత్తకోట రూరల్‌: అదుపు తప్పి కంటైనర్‌ బోల్తా పడిన ఘటన మండలంలోని ఎన్‌హెచ్‌ 44 పై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. హైదరాబాద్‌ నుంచి కర్నూల్‌ వైపు వెళ్తున్న కంటైనర్‌ అతివేగంగా వెళ్తూ అదుపు తప్పి మండలంలోని ముమ్మళ్లపల్లి జాతీయ రహదారి44పై పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో కంటైనర్‌ డ్రైవర్‌ రవి, క్లీనర్‌ మహేందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని, ప్రమాదం జరిగిన విషయంపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఆనంద్‌ తెలిపారు.

క్షయ నిర్మూలనకే వైద్య శిబిరాలు



ఖిల్లాఘనపురం: దేశంలోని ప్రతి గ్రామంలో టీబీ వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకే ప్రభుత్వం టీబీ నిర్ధారణ క్యాంపులు నిర్వహిస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. బుధవారం మండలంలోని మానాజీపేట, ఖిల్లాఘనపురం గ్రామాల్లో టీబీ నిర్ధారణ క్యాంపులు నిర్వహించి, 150 మందికి పరీక్షలు చేశారు. వారిలో 12 మందికి టీబీ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి అవసరమైన ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ నర్సింహులు, శ్రీనివాస్‌, జిల్లా టీబీ విభాగం సిబ్బంది బాసింత్‌ ఖాన్‌, నాగేశ్వర్‌, టెక్నీషియన్‌ ఈశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మదనాపురం: మండలంలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆత్మకూరు సీడీపీఓ లక్ష్మమ్మ చిన్నారులకు అన్నప్రాసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి చిన్నారిని తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ భారతమ్మ, అంగన్‌వాడీ టీచరు సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ బోనాలు

పాన్‌గల్‌: ఈదమ్మ దేవత ఉత్సవాలు రెండో రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా మహిళలు బోనాలను అలంకరించి ఊరేగింపుగా వెళ్లి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవిద్యంగా సమర్పించారు. దీంతో పాటు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లను అలంకరించి గుడిచుట్టూ తిప్పారు. ఉత్సవాలకు వచ్చిన ఆడపడుచుకు గాజులు వేయించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. దీంతో గాజుల దుకాణాలు మహిళలతో కిక్కిరిసాయి. జాతరలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ శ్రీనివాసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు రాముయాదవ్‌, బ్రహ్మయ్య, తహసీల్దార్‌ సత్యనారాయణరెడ్డి, డీటీ అశోక్‌నాయుడు పాల్గొన్నారు.

ఈదమ్మను దర్శించుకున్న తహసీల్దార్‌

మండల కేంద్రంలోని ఈదమ్మ ఆలయంలో బుధవారం తహసీల్దార్‌ సత్యనారాయణరెడ్డి తన కార్యాలయ సిబ్బందితో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తహసీల్దార్‌కు స్వాగతం పలికారు.



పాన్‌గల్‌ ఈదమ్మ గుడి వద్ద బోనాలతో మహిళలు



అమ్మవారి దర్శనంలో తహసీల్దార్‌

అమ్మవారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందించారు. తహసీల్దార్‌ వెంట ఆర్‌ఐ మహేష్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ రాజశేఖర్‌, మల్లేష్‌ పాల్గొన్నారు.



గాజులు వేయించుకుంటున్న మహిళలు

రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి

వనపర్తి రూరల్‌: స్థానిక వ్యవసాయ మార్కెట్‌ యార్డుకు వచ్చే రైతుల శ్రేయస్సు కోసం మార్కెట్‌ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని మార్కెట్‌ యార్డు చైర్మన్‌ బండారు శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్‌ యార్డు చైర్మన్‌ చాంబర్‌లో మార్కెట్‌ యార్డు చైర్మన్‌ బండారు శ్రీనివాస్‌గౌడ్‌ అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, అదేవిధంగా ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ యార్డులో మీటర్లను ఏర్పాటు చేయడంతో పాటు రక్షణగా జాలీలు బిగించామన్నారు. షాపులను వినియోగంలోకి తీసుకొచ్చి, ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ యాడ్‌ షాపులు యజమానులకు అందజేస్తామని తెలిపారు. మార్కెట్‌ యార్డు కమిటీ ఆధ్వర్యంలో త్వరలో మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లు శ్యాంసుందర్‌ రెడ్డి, సురేష్‌, కృష్ణయ్య, గోపాల్‌నాయక్‌, లతీఫ్‌, శారద, శాంతన్న, మార్కెట్‌ శాఖ అధికారి స్వర్ణజిత్‌ సింగ్‌, మార్కెట్‌ కార్యదర్శి సరోజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్‌ శ్రీనివాస్‌గౌడ్‌

సీనియర్‌ మేటీలను ఎఫ్‌ఏలుగా నియమించాలి

గోపాల్‌పేట: ఉపాధిహామీలో పనిచేస్తున్న సీనియర్‌ మేట్లను ఫీల్డ్‌ అసిస్టెంట్లుగా నియమించి, గౌరవవేతనం ఇవ్వాలని సీనియర్‌ మేట్లు ఎంపీడీఓ శంకర్‌ నాయక్‌ను కోరారు. బుధవారం ఉపాధిహామీలో కొన్నేళ్లుగా పనులు చేస్తున్నామని ఫీల్డ్‌ అసిస్టెంట్లుగా ఖాళీలు ఉన్న స్థానాల్లో తీసుకోవాలని కోరారు. మండలంలో రెండోచోట్ల ఉపాధిహామీ ఫీల్డ్‌ అసిస్టెంట్లు లేరని అవకాశం ఉన్నచోట సీనియర్‌ మేట్లుగా పనిచేస్తున్న వారిని తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మేట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రమేష్‌, కవిత పాల్గొన్నారు.

ఆస్పత్రి కార్మికుల పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

ఆత్మకూర్‌: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు 9 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని తెలంగాణ మెడికల్‌ కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌, ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి శ్రీహరి అన్నారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని బుధవారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. 9 నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్‌ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడని మండిపడ్డారు. శానిటేషన్‌, పేషెంట్‌ కేర్‌, సెక్యూరిటీ, సూపర్‌వైజర్‌ కార్మికులకు జీఓ 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా.. అందులో కోతలు పెడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్‌ వెంకటయ్య ఏజెన్సీ నిర్వాహకులు కోతలు పెట్టడంతోపాటు గతేడాది ఆగస్టు నుంచి వేతనాలు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో కార్మికులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్‌, భరత్‌, మోహినిద్దీన్‌, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్‌, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్‌ తదితరులు ఉన్నారు.



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న వైద్య కార్మికులు

పంటసాగు వివరాలు నమోదు చేసుకోండి

అమరచింత: యాసంగిలో రైతులు సాగుచేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏడీఏ దామోదర్‌ కోరారు. మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల్లో రైతులు సాగు చేసిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను సర్వే నంబర్ల ఆధారంగా సంబంధిత ఏఈఓలను కలిసి రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పంటల నమోదు చేసుకుంటే అమ్ముకునే సమయంలో ఇబ్బందులు ఎదురుకావన్నారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్‌, ఏఈఓ శివకుమార్‌ పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ



వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులకు షూస్‌ను పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్‌ మౌలాలి, మాజీ ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేష్‌, వేణుమాధవ్‌రెడ్డి, మోహన్‌కుమార్‌ షూస్‌ను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సింహులు, కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, స్వామి, శ్రీనివాసులు, గ్రామస్తులు రాముడు, సుధాకర్‌గౌడ్‌, రాజశేఖర్‌, జైరాం పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

వనపర్తి రూరల్‌: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తుందని, ఇందులో భాగంగానే కేంద్ర బడ్జెట్‌లో వారికి అన్యాయం చేశారని ప్రజా సంఘాలు సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో సమీపంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, ఏఐటీసీయూ కార్యదర్శి మోషా, టీయూసీఐ జిల్లా నాయకులు గణేష్‌, వ్యసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో పెట్టుబడిదారులు, కార్పొరేట్‌ సంస్థలకు రాయితీలు ఇచ్చి సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు తగిన బడ్జెట్‌ కేటాయించలేదని, మరోసారి సవరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నందిమల్ల రాములు, బొబ్బిలి నిక్సన్‌, గోపాలకృష్ణ, రమేష్‌, చంద్రయ్య, గోవిందు, శివ, దొరస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.



వనపర్తిలో బడ్జెట్‌ ప్రతులను దహనం చేస్తున్న కార్మికులు

బడ్జెట్‌ ప్రతుల దహనం

వనపర్తి రూరల్‌: కార్పొరేట్‌ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా భవన, నిర్మాణ సంఘంయూనియన్‌ జిల్లా అధ్యక్షుడు గంధం మదన్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్‌ కార్మికులతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌ చౌరస్తాలో బడ్జెట్‌ పత్రులను దహనం చేశారు. కార్యక్రమంలో డీకే కురుమన్న, బాలస్వామి, రాబర్ట్‌, బాలరాజు, పుల్లన్న, గట్టన్న, రవి, మన్యం, విజయ్‌కుమార్‌, భాస్కర్‌, నాగేషు, దేవేందర్‌, నాగరాజు, అంజి, మురళి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

ఆత్మకూర్‌: జర్నలిస్టుల వృత్తి ఎంతో పవిత్రమైందని, వృత్తికి కలంకం తీసుకొచ్చే విధంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్రకార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్‌ అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అమరచింత, ఆత్మకూర్‌ మండలాల టీయూడబ్ల్యూజే, ఐజేయూ జర్నలిస్టుల సభ్యత్వాల నమోదు, సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మధుగౌడ్‌ మాట్లాడుతూ అక్రిడిటేషన్‌ కలిగి ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఉచిత వైద్యం, పిల్లలకు విద్య అందించేందుకు రాష్ట్ర ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాల్యాల బాలస్వామి, మాధవరావు, పూర్ణారెడ్డి, విజయ్‌, జిందే శ్రీను, తొకలి శ్రీను, రఫీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

అరెస్టులు కాదు.. పెండింగ్‌ బిల్లులు చెల్లించండి

పాన్‌గల్‌: అరెస్టులు చేయడం కాదని జీపీలకు ఉన్న పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. జీపీల పెండింగ్‌ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం మాజీ సర్పంచ్‌లు చలో హైదరాబాద్‌ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో.. పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లుగా విధులు నిర్వహించిన కాలంలో అప్పులు చేసి జీపీల్లో పలు అభివృద్ధి పనులు చేసినా.. వాటికి బిల్లులు నేటికీ మంజూరు కాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండిగ్‌ బిల్లులు చెల్లించి ఇబ్బందులను తొలగించాలని డిమాండ్‌ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు రాములు, నాగేష్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, తిరుపతియాదవ్‌ తదితరులు ఉన్నారు.



పాన్‌గల్‌ పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

ఆర్టీసీ బస్సుల అద్దె తగ్గింపు

వనపర్తి టౌన్‌: పెళ్లిళ్లు, శుభకార్యాలు, వినోద, విహార, తీర్థయాత్రల కోసం అద్దెకు తీసుకునే ఆర్టీసీ బస్సుల అద్దెను భారీగా తగ్గించినట్లు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌ వేణుగోపాల్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దె ప్రాతిపదికన తీసుకునే బస్సులకు గతంలో తీసుకునే చార్జీలపై, ఇప్పుడు కిలో మీటర్‌కు రూ.7, అలాగే 6గంటల వెయిటింగ్‌ చార్జీ మినహాయింపు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో ఇస్తున్న డ్రైవర్‌ బత్తా చెల్లించాల్సిన అవసరం లేదని, సౌకర్యవంతమైన బీఎస్‌6 టెక్నాలజీతో అత్యంత ఆధునిక సౌకర్యవంతమైన కొత్త బస్సులను, ఎక్కడి నుంచి ఎక్కడికైనా, ఎన్ని గంటలైనా అద్దెకు తీసుకోవచ్చని డీఎం వివరించారు. బస్సులను బుక్‌ చేసుకునేందుకు 99592 26289, 79957 01851, 96765 63377 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం

పెబ్బేరు రూరల్‌: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ ఆధ్వర్యంలో బుధవారం పెబ్బేరు మండలంలోని మోడల్‌ స్కూల్‌లో ఆటపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్స్‌ కబడ్డీ, జూనియర్స్‌ కబడ్డీ, జూనియర్స్‌ ఖోఖో పోటీలో గెలుపొందిన విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్‌ తూర్పింటి నరేష్‌కుమార్‌ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందిచుకోవచ్చన్నారు. అంతేకాకుండా క్రీడల వల్ల భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, మంగమ్మ, ఫకీరయ్య, మోసీస్‌, రమేష్‌, వేణు, సుమిత్ర, నాగమణి, హేమలత, అంజనీదేవి, సాహిత్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

‘తొలి కుల గణన కాంగ్రెస్‌కే సాధ్యం’

కొత్తకోట: వెనుకబడిన, బలహీన వర్గాల హక్కుల కోసం ఉద్దేశించిన తొలి సమగ్ర కుల గణన స్వతంత్ర భారతదేశ చరిత్రలో సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమైందని మార్కెట్‌ యార్డ్‌ చైర్మన్‌ పల్లెపాగు ప్రశాంత్‌ అన్నారు. పట్టణ చౌరస్తాలో బుధవారం కుల గణన అమలు చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీచుపల్లి యాదవ్‌, మేస్త్రీ శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, ఎస్‌జే.బోయేజ్‌, మిషేక్‌, జేసీబీ శ్రీను, వెంకటేశ్వర్‌ రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీను, అంజన్న, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్‌ నాయకులు బాణసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీ డిక్లరేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శాసనభలో ప్రకటించి తీసుకున్న నిర్ణయం చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు.

పదవులు తాత్కాలికం.. అభివృద్ధి శాశ్వతం

వనపర్తి: జిల్లాకేంద్రంలో కొంతకాలంగా అభివృద్ధి ఆగిపోయిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌ రెడ్డి అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో.. ఇటీవల పదవీకాలం ముగిసిన వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల తాజా మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. సమర్థవంతంగా ఐదేళ్లు పురపాలన చేశారని శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేసుకున్నామని, జిల్లా కేంద్రంలో ప్రజల ఆమోదంతో భవిష్యత్‌ తరాలకు ఉపయోగపడేలా రోడ్ల విస్తరణ పనులు చేశామన్నారు. మరోసారి జిల్లా అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ పాలన అవసరమవుతుందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్‌, పెబ్బేరు మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ కరుణశ్రీ, వైస్‌ చైర్మన్‌ వాకిటి శ్రీధర్‌, నాయకులు దిలీప్‌రెడ్డి, నందిమల్ల అశోక్‌, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, తిరుమల్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి

వనపర్తి రూరల్‌: చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) సుధారాణి సూచించారు. బుధవారం మండలంలోని అంజనగిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ హజీరాబేగంతో కలిసి ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అలాగే కేంద్రం నిర్వహణపై ఉపాధ్యాయురాలికి పలు సూచనలిచ్చారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్‌ కో–ఆర్డినేటర్‌ శేఖర్‌ పాల్గొన్నారు.



చిన్నారులను పరిశీలిస్తున్న డీడబ్ల్యూఓ సుధారాణి

ఉచిత న్యాయసేవలు వినియోగించుకోవాలి

వనపర్తి టౌన్‌: న్యాయస్థానాల్లో కక్షిదారులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వనపర్తి ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని వనపర్తి రెండో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి వై.జానకీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలల న్యాయస్థానం, బాలల సంక్షేమ సమితి కార్యాలయంలో నిర్వహించిన కక్షిదారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు ఆపదలో ఉన్న ఉండి, రూ.మూడు లక్షల సంవత్సర ఆదాయం ఉన్న వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. లోక్‌ ఆదాలత్‌ సేవలకు టోల్‌ ఫ్రీ నెంబర్‌ 15100 సంప్రదించాలని, ఉచిత న్యాయ సేవలతో కక్షిదారులకు ఆర్థిక ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీపీ రాజేష్‌, డి.కృష్ణయ్య, సఖి కేంద్ర లీగల్‌ కౌన్సిల్‌, చైల్డ్‌ ప్రొటెక్షన్‌ ఆఫీసర్‌ రాంబాబు, బాలల సంక్షేమ సమితి సభ్యులు, పారా లీగల్‌ వలంటీర్లు శ్రీనివాస్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్‌ సివిల్‌ జడ్జి వై.జానకి

సకాలంలో టీకాలు వేయించాలి

పాన్‌గల్‌: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి వారిని వ్యాధుల నుంచి కాపాడాలని సీహెచ్‌ఓ రామయ్య, ఆయుష్మాన్‌ ఆరోగ్య మందిర్‌ వైద్యాధికారి తారాశశాంక్‌ అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, వెంగళాయిపల్లి గ్రామాల్లోని సబ్‌సెంటర్లను వారు సందర్శించి వ్యాధి నిరోధక టీకాల విధానాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్‌లో వచ్చే అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమాదేవి, సరళ, శైలజ పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రానికి మేలు

కొత్తకోట: సౌభాగ్య తెలంగాణ భారతీయ జనతా పార్టీతోనే సాధ్యపడుతుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు కొమ్ము భరత్‌భూషణ్‌ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో బుధవారం భారత ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భరత్‌భూషణ్‌ మాట్లాడుతూ రాష్ట్రానికి రూ.537 కోట్లు రైల్వే నిధులు, రూ.1.5 వడ్డీలేని రుణాలు కేంద్రం ఇచ్చినప్పటికీ కాంగ్రెస్‌, కమ్యూనిస్టులు ధర్నాలు, రాస్తారోకో చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నవీన్‌ కుమార్‌రెడ్డి, దాబా శ్రీనివాస్‌రెడ్డి, పబ్బా నరేందర్‌గౌడ్‌, అమరేందర్‌, రాఘవేందర్‌రెడ్డి, ఆవుల రవి, కోటేశ్వర్‌రెడ్డి, స్టార్‌ బాలు, మహేష్‌, రాఘవేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



ప్రధాని, ఆర్థిక మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కొత్తకోట బీజేపీ నాయకులు

బీజేపీ అధ్యక్షుడికి సన్మానం

వనపర్తి టౌన్‌: బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా రెండో పర్యాయం నియమితులైన డి.నారాయణను మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొమ్ము చెన్నకేశవులు, పెద్ది రాజు, గంధం గట్టయ్య మాదిగ, మీసాల నాగరాజు మాదిగ, విష్ణు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణే లక్ష్యం

అమరచింత/వీపనగండ్ల: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అమర చింత, తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్‌ భువనేశ్వర్‌, నందకిశోర్‌, వీపనగండ్లలో వైద్యాధికారి రాజశేఖర్‌ పాల్గొని వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆల్బెండజోల్‌ మాత్రలను తప్పనిసరిగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న వారికి అందించాలన్నారు. ఫిబ్రవరి 10, 17 తేదీల్లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని నులి పురుగులను నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.